అప్రజాస్వామికం.. అనైతికం

- ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌పై బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం
- జిల్లా వ్యాప్తంగా రాస్తారోకోలు, నిరసనలు
- తొర్రూరులో పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

తొర్రూరు, మార్చి 16: ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అప్రజాస్వామికం, అనైతికమని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ నిరసనలో మాజీ మంత్రి ఎర్రబెల్లి పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా శని, ఆదివారాలు కోర్టుకు సెలవు ఉండటంతో కావాలనే శుక్రవారం అరెస్ట్ చేశారని అన్నారు. రాజకీయంగా దెబ్బతీయాలని పథకం ప్రకారం కుట్రతో బీజేపీ అరెస్ట్ చేయించిందని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్ర మంత్రులు, బీజేపీ నాయకులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యేలు ఈడీ అధికారుల్లా కవితను అరెస్ట్ చేస్తామని ఏడాదిన్నర కాలంగా పలుమార్లు ప్రకటనలు చేశారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వబోతున్నామని ఈసీ ప్రకటన ఇచ్చిన నేపథ్యంలో కవితను అరెస్ట్ చేయడం బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్‌ను నైతికంగా దెబ్బతీసే ప్రయత్నమని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధిపొందాలని బీజేపీ, కాంగ్రెస్ కలిసి కుట్రలు పన్నుతున్నాయని తెలిపారు. ఆడబిడ్డపై జరుగుతున్న దాడిపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్నామని, ఈ సెగ కేంద్రానికి తగులుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ తొర్రూరు, రాయపర్తి, పెద్దవంగర అధ్యక్షులు పసుమర్తి సీతారాములు, మూనావత్ నరసింహనాయక్, ఈదురు అయిలయ్య, ఎంపీపీలు తూర్పాటి చిన్న అంజయ్య, జినుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీలు మంగళపల్లి శ్రీనివాస్, రంగు కుమార్, నాయకులు బిల్లా సుధీర్‌రెడ్డి, శ్రీరాంసుధీర్, నలమాస ప్రమోద్, కుర్ర శ్రీనివాస్, అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, ఎన్నమనేని శ్రీనివాసరావు, కాలునాయక్, రామలింగం, వీరారెడ్డి, రాయిశెట్టి వెంకన్న, మంగళపల్లి ఆశయ్య, వినయ్ పాల్గొన్నారు.

తొర్రూరు: తొర్రూరులో వరంగల్ – ఖమ్మం ప్రధాన రహదారిపై రాస్తారోకోలో బైఠాయించి నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

బీఆర్ఎస్‌ను దెబ్బ తీసేందుకే..
మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బీజేపీ అరెస్ట్ చేయించింది. లిక్కర్ కేసు రెండేళ్లుగా కొనసాగుతోందని, అందులో కవిత ప్రమేయం ఉందని పలుమార్లు ఈడీ నోటీసులు జారీ చేసినప్పటికీ అరెస్ట్ చేయకుండా, ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన సమయంలో తెలంగాణలో బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకే మోదీ అరెస్ట్ డ్రామా ఆడుతున్నారు. కవిత నిజంగా లిక్కర్ స్కాంలో ఉంటే ఇన్ని రోజులు ఎందుకు అరెస్ట్ చేయలేదో స్పష్టం చేయాలి. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న కుట్రలను ప్రజలు చూస్తున్నారు. ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ పార్టీ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మరిన్ని సీట్లు గెలుస్తుంది.

బయ్యారం: బస్టాండ్ సెంటర్‌లోని రాస్తారోకోలో పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్ బిందు

బయ్యారం బస్టాండ్ సెంటర్‌లో..

బయ్యారం: మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు శనివారం రాస్తారోకో చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ బిందు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాజకీయ కక్షలో భాగంగా ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేశారని తెలిపారు. బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేకనే అరెస్ట్‌తో ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు మానుకోవాలని, కవితను వెంటనే విడుదల చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు తాత గణేశ్, సొసైటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు ఐలయ్య, శ్రీను, రాము, రాజేశ్, గణేశ్ పాల్గొన్నారు.

గార్లలో..

గార్ల: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అక్రమను అరెస్ట్‌ను ఖండించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్ నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని నెహ్రూసెంటర్‌లో బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కక్ష కారితపూరితంగా వ్యవహరిస్తున్నారని, ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టించి, అరెస్ట్‌లు చేయిస్తున్నారని అన్నారు. రాధాకృష్ణ, శీలంశెట్టి ప్రవీణ్, ఖదీర్, యాకుబ్ పాల్గొన్నారు.

కావాలనే.. అక్రమ అరెస్ట్
మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

మహబూబాబాద్: ఎమ్మెల్సీ కవితను బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికలకు ముందు కావాలనే అరెస్ట్ చేయించిందని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు ఆరోపించారు. శనివారం ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని స్థానిక నెహ్రూసెంటర్‌లో వారు కార్యకర్తలు, నాయకులతో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత మహిళా బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని పోరాటం చేయగా సహించని మోడీ ఈడీ అధికారులతో అరెస్ట్ చేయించడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల సమయంలో కేసీఆర్ కుటుంబాన్ని అభాసుపాలు చేసేందుకే మోదీ అరెస్ట్ డ్రామా మొదలుపెట్టాడని దుయ్యబట్టారు. కోర్టులో కేసు కొనసాగుతుండగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు ఇవ్వకపోవడంతో పంటలు ఎండుతున్నాయని, ప్రజలకు తాగునీరు కూడా ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాయమాటలు చెప్పి మోసగించేందుకు వస్తున్నారని, ప్రజలు గమనించి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. 27వ వార్డు కౌన్సిలర్ ఎండీ ఫరీద్, ముత్యం వెంకన్న, మండల అధ్యక్షుడు తేళ్ల శ్రీనివాస్, సలీం, దాసరి రావీశ్, అశోక్, ఎలేందర్, మండల రఘు, రాజ్‌కుమార్, భూక్య సునీత, ఆసిఫ్‌అలీ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడిని నిలదీస్తున్న ఆ పార్టీ కార్యకర్తలు

సీతారాంనాయక్ రాకతో బీజేపీలో రచ్చ

మహబూబాబాద్ రూరల్, మార్చి 16: బీజేపీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆజ్మీరా సీతారాం నాయక్ పార్టీలో చేరిన తర్వాత శనివారం తొలిసారిగా ఆ పార్టీ జిల్లా కార్యాలయానికి ముఖ్య కార్యకర్తల సమావేశానికి రాగా బీజేపీ నాయకులు ఆందోళన బాట పట్టారు. ఏళ్లుగా పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు లేదని, కొత్తగా వచ్చిన నాయకులకు ప్రాధాన్యం ఏమిటని ప్రశ్నించారు. సీతారాంనాయక్‌కు జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్లు వివిధ మండలాల నాయకులను పరిచయం చేశారు. కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో గతంలో ఉన్న పార్టీ మండల అధ్యక్షులను మార్చి కొత్తగా వివిధ మండలాలకు అధ్యక్షులను నియమించటం ఏమిటని, ఈ ఎన్నిక ఎవరు చేశారని, జిల్లా అధ్యక్షుడిని నిలదీశారు. జిల్లా, రాష్ట్ర నాయకుల ప్రమేయం లేకుండా నియామకాలు చేయొద్దని కార్యకర్తలు నినాదాలు చేశారు. పాత జిల్లా పార్టీ అధ్యక్షుడు రామచందర్ రావు వర్గీయులు, కొత్త అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, గతంలో పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేసిన హుస్సేన్‌నాయక్, పార్లమెంట్ టిక్కెట్ ఆశించిన యాప సీతయ్య కార్యకర్తల మధ్య గొడవ జరిగింది. కొందరు నాయకులు జోక్యం చేసుకొని సర్ది చెప్పారు.

ఘనంగా వీరభద్రస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు
భక్తిప్రపత్తులతో పుష్పోత్సవం

కురవి, మార్చి 16: భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు శనివారం పుష్పోత్సవం ఘనంగా జరిగింది. ఈనెల 7వ తేదీన అంకురార్పణతో మొదలుకాగా 20న బుధవారం పార్వతీ సమేత వార్షిక కల్యాణం, 22న పదహారు రోజుల పండుగతో పరిసమాప్తం కానున్నాయి. పుష్పోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై స్వామివారు, అమ్మవారిని, చండీశ్వరుడిని ప్రతిష్ఠించి పూజారులు, వేదపండితులు బాలకృష్ణ, శ్రీకాంత్, పెనుగొండ అనిల్, రెడ్యాల శ్రీనివాస్, విజయ్, తేజ, పుణ్యమూర్తి, రమేశ్, విజయ్, అభిలాష్, శివ శాస్త్రోయుక్తంగా పూజాదికాలను నిర్వహించారు. స్వామివారి ముఖమండపంలో శయన మందిరాన్ని ఏర్పాటుచేసి పుష్పోత్సవం కోసం ఊయలను ఏర్పాటుచేశారు. ఊయలలో స్వామివారి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పెట్టి ఏకాంతం కల్పించి కల్యాణ బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, ఆలయ ఈవో సత్యనారాయణ పాల్గొన్నారు. పూజల్లో పాల్గొన్న మహిళలకు అమ్మవారి ప్రసాదంగా జాకెట్ ముక్కలు, పసుపు కుంకుమను అందించారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పూజారులు, వేదపండితులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దు

కేసముద్రం, మార్చి 16: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో డీఈ విజయ్ సూచించారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓవర్ లోడ్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ వేయాలని సూచించారు. ఎండలు పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏడీఈ శ్రీనివాస్‌లు, ఏఈలు వశీధర్, రాజు పాల్గొన్నారు.

బయ్యారంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

బయ్యారం, మార్చి 16: బయ్యారంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య శనివారం సుడిగాలి పర్యటన చేశారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. తొలుత బయ్యారం, జగ్గు తండా, గురిమేల్ల, వినోద నగరం, గౌరారం గ్రామపంచాయతీ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.1.20కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. గౌరారం, కంబాలపల్లి, నామాలపాడు, నారాయణపురం సమీపంలో పలు వాగులపై రూ.10.42కోట్ల వ్యయంతో చేపట్టే చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బయ్యారం, కొత్తపేట, రామచంద్రాపురం, ఉప్పలపాడు పరిధి లబ్ధిదారులకు ఇంటింటికీ తిరిగి కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే సర్కారు ధ్యేయమని తెలిపారు. తహసీల్దార్ సదియా సుల్తానా, ఎంపీడీవో శ్రీనివాస్, ఏఈలు శ్రీకాంత్, రాజశేఖర్, సొసైటీ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, ఎంపీటీసీ శైలజారెడ్డి, కుమారి, భద్రయ్య, మోహన్‌జీ, లక్ష్మీ, డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముసలయ్య, నాయకులు ప్రవీణ్‌నాయక్, వెంకటపతి, కృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి : ఎమ్మెల్యే

కేసముద్రం, మార్చి 16: ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి అభ్యున్నతికి పాటుపడాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. శనివారం మండలంలోని తాళ్లపూసపల్లిలో ఉన్న స్వయంభూ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం కల్వల మోడల్ స్కూల్‌లో రూ.10లక్షలతో చేపట్టే వంటగది, డైనింగ్ హాల్ నిర్మాణ పనులు, అమినాపురంలో రూ.10లక్షలతో నిర్మించే అంబేద్కర్ భవన నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, గంట సంజీవరెడ్డి, అంబటి మహేందర్‌రెడ్డి, పోలెపాక నాగరాజు, చిలువేరు సమ్మయ్యగౌడ్, బండారు దయాకర్, బట్టు శ్రీనివాస్, అశోక్ స్టాలిన్, తరాల వీరేశ్, కామ సంజీవరావు, నీరుటి సామేలు ఉన్నారు.

వంటగది నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖరప్రసాద్

రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 16 : కక్షిదారులు తమ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర ప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఎక్కువగా క్రిమినల్ కేసులు, వివాహ సంబంధ కేసులు రాజీమార్గంలో పరిష్కారం కోసం వస్తున్నాయని తెలిపారు. సివిల్ తగాదాలను సైతం రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. కక్షిదారులు కోర్టు చుట్టూ తిరుగుతూ సమయం వృథా చేసుకోకుండా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సురేశ్, పీపీ వెంకటేశ్వర్లు, జీపీ వెంకటయ్య పాల్గొన్నారు.

గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

డోర్నకల్, మార్చి 16: చిలుకోడులో యాదవ సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేద పండితులు మంత్రోచ్ఛారణ నడుమ గంగమ్మతల్లి ప్రతిష్ఠాపన జరిగింది. భక్తులకు మహా అన్నదానం చేశారు. యాదవ కులస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

కేసముద్రం, మార్చి 16: మాజీ జడ్పీటీసీ వేం పురుషోత్తంరెడ్డి జయంతిని పురస్కరించుకొని కుమారులు చేతన్, చరణ్ 11 మంది విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన బాలికలు ఉప్పరపల్లిలోని జడ్పీఎస్ఎస్‌కు రోజూ నడుచుకుంటూ వెళ్తున్నారు. గ్రామానికి చెందిన యువకుడు భరత్ వారి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి సైకిళ్లను పంపిణీ చేశారు. జీ వెంకన్న, మోడెం రాజు, చీర వీరస్వామి, చీర వెంకన్న, సంతోశ్, యాకంబ్రం, కుమార్ పాల్గొన్నారు.

సైకిళ్లను పంపిణీ చేస్తున్న చేతన్

సుధాకర్‌రావుకు కాంగ్రెస్ నాయకుల నివాళి

పెద్దవంగర, మార్చి 16: పాలకుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నెమురుగొమ్ముల సుధాకర్‌రావు ఇటీవల మృతిచెందగా స్వగ్రామం వడ్డెకొత్తపల్లిలోని నివాసంలో ఆయన చిత్రపటం వద్ద శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అనుమాండ్ల ఝాన్సీరెడ్డి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేశ్, పాలకుర్తి దేవస్థాన డైరెక్టర్ వేణు, ప్రవీణ్‌రావు, మురళి, వెంకన్న, సతీశ్, సీతారాంనాయక్, చంద్రశేఖర్, రాంబాబు, శ్రీనివాస్, జానీపాషా, మల్లేశ్, జనార్ధన్, యాకయ్య పాల్గొన్నారు.

సుధాకర్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి, నాయకులు

మండల మ్యాప్‌ను పరిశీలిస్తున్నఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

డోర్నకల్ పోలీసు స్టేషన్ ఆకస్మిక తనిఖీ

డోర్నకల్, మార్చి 16: డోర్నకల్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి, క్రైమ్ రేట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. డోర్నకల్ ఎస్సీ, బీసీ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్ట్‌ను పరిశీలించారు. ఉయ్యాలవాడలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. సీఐ ఉపేందర్‌రావు, ఎస్సై తిరుపతి పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

తొర్రూరు, మార్చి 16: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో హైమావతి అన్నారు. మండలంలోని అమ్మాపురం అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో మాట్లాడారు. చిన్నపిల్లలకు అన్న ప్రాసన చేపట్టారు. భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. సుకన్య సమృద్ధి యోజన గురించి వివరించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండరల్ స్పెషలిస్ట్ ఎన్ అరుణ, అంగన్‌వాడీ సభ్యులు కవిత, పద్మ, అలివేలు, సరోజినీ, 30 మంది మహిళలు, మహిళా సాధికారత కేంద్రం స్టాఫ్ సంధ్యారాణి, రాకేశ్ పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో హైమావతి

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

కేసముద్రం, మార్చి 16: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో 10జీపీఏ సాధించాలని కేసముద్రం స్టేషన్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాజు, సమ్మగౌడ్ ఫౌండేషన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ అన్నారు. పదో తరగతి విద్యార్థులకు సమ్మయ్యగౌడ్ పరీక్షా కిట్లను అందించారు. వారు మాట్లాడుతూ పరీక్షలు అంటే భయాన్ని వీడాలని, ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. నర్సయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నరసింహారెడ్డి, కృష్ణవేణి, మధు, యాదగిరి, మదన్, శ్రీను, సదయ్య ఉన్నారు.

ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి

కేసముద్రం, మార్చి 16: కార్మికులు ఐక్యంగా హక్కులను సాధించుకోవాలని హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ్వారపు శ్రీధర్ అన్నారు. శనివారం కేసముద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. వెంకన్న, రాజు, దేవేందర్, జిలాని, నరేశ్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

ఓటుతో బీజేపీకి బుద్ధి చెబుతాం : ఎమ్మార్పీఎస్

గూడూరు, మార్చి 16: ఎన్నికల సమయంలో దళితులను మోసం చేసిన బీజేపీకి ఓటుతోనే బుద్ధి చెబుతామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికారి ప్రతినిధి కోండ్ర ఎల్లయ్య, కోర్ కమిటీ సభ్యుడు సంజీవ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో జరిగిన సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో మాదిగలు, ఉపకులాలను వర్గీకరణ చేస్తామని చెప్పిన మోదీ ప్రభుత్వం మోసం చేస్తూ ఉందన్నారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు నమిలి సాంబయ్య, ప్రధాన కార్యదర్శి హెచ్ శివ, ఉపాధ్యక్షులుగా సప్పట్ల రాము, జనగం మహేశ్, సహాయ కార్యదర్శిగా కొమ్ముల శ్రీనివాస్, కోశాధికారిగా గద్దల బాబు, ప్రచార కార్యదర్శిగా మైదం నాగరాజు, పొలెపాక యాకయ్య, యువసేన అధ్యక్షుడిగా బోడ రవివర్మను ఎన్నుకున్నారు. సంఘం జిల్లా కార్యదర్శి బోడ ఎల్లయ్య, నమిల రమేశ్, రాణాప్రతాప్, గణేశ్, ముక్తీశ్వర్, సాయిరాం, సూరయ్య, మల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

20న ఠానునాయక్ వర్ధంతి

గార్ల, మార్చి 16 : ఈనెల 20న ఠానునాయక్ 74వ వర్ధంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మాలోత్ శాంతికుమార్, భూక్య హరినాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో గిరిజన హక్కుల గర్జన కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ గిరిజన సమస్యలను రాజకీయ పార్టీలు ఎజెండాలో పెట్టి పరిష్కరించాలన్నారు. గిరిజన హక్కుల పోరాటం ఫలితంగానే గిరిజనులు రాజ్యాంగం ప్రత్యేక హక్కులు చట్టాలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పూల్‌చంద్, శ్రీను, వీరన్న, సైదులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కార్యదర్శి మృతి

నెల్లికుదురు, మార్చి 16: మండలంలోని ఎర్రబెల్లిగూడెం గ్రామ కార్యదర్శి రాకేశ్ అనారోగ్యంతో మృతిచెందాడు. అంత్యక్రియల్లో తహసీల్దార్ రాజు పాల్గొని పాడె మోశారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

డీఎంహెచ్‌వోను కలిసిన వైద్యులు

గార్ల, మార్చి 16 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన బీ కళావతి బాయిని శనివారం డాక్టర్ రాజ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో అంబరీష, డాక్టర్ నెహ్రూ నాయక్, నవీన్, సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిపిన వాహనాలను ఫొటో తీస్తున్న పోలీస్

రోడ్డుపై నిలిపిన బైక్‌లకు జరిమానా

గూడూరు, మార్చి 16: మండల కేంద్రంలో బస్టాండ్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా బస్టాండ్‌కు సమీపంలోని యూనియన్ బ్యాంకు ముందు ద్విచక్రవాహనాలు ఎన్‌హెచ్-365 పైనే నిలుపడంతో వచ్చి పోయే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. వాహనాలను రోడ్డుపై నిలుపొద్దని పోలీసులు ఎన్నిసార్లు సూచించినా పెడచెవిన పెడుతున్నారు. దీంతో శనివారం ఎస్సై నగేష్ ఆధ్వర్యంలో బ్యాంకు ముందు రోడ్డుపై నిలిపిన వాహనాల ఫొటోలు తీసుకున్నారు. ఆయా వాహనదారులకు జరిమానా విధించనున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను సమీక్షించాలి

నెల్లికుదురు, మార్చి 16: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను పునఃసమీక్షించాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు బాలు, శ్రీనివాసులు కోరారు. శనివారం ఆలేరు పాఠశాలలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. బడికి సంబంధంలేని గ్రామైక్య సంఘం అధ్యక్షురాలిని చైర్మన్‌గా చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ నిర్ణయంతో నాలుగు వేర్వేరు ప్రాంతాల్లోని పాఠశాలకు ఒక్కరే చైర్మన్‌గా వ్యవహరించాల్సి ఉంటుందని తెలిపారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిని చైర్మన్‌గా నియమించాలని కోరారు. ఉదయ్‌కిరణ్, గోవర్ధన్, రవి, నవీన్, శ్రీరాం, ప్రవీణ్‌కుమార్, సైదులు, పాషా ఉన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

REAL ESTATE

శ్రీ లక్ష్మి గణపతి రియల్ ఎస్టేట్స్
★రామన్నపేటలో 204 G+2, 95 Lakhs, 204 కమర్షియల్ 1.65 Co., 181 ఓపెన్ ప్లాట్ 60 Lakhs, 25 గజాల కమర్షియల్ 16 Lakhs, ఓపెన్ 4 ప్లాట్స్, 20 గజాలు, 153 గజాలు, 1.50 Co.,. Cell: 9912244025, 9292104080.
NTW-323176

ఆదిత్య శ్రీ రియాల్టర్స్ & డెవలపర్స్
★మీకు సంబంధించిన ఖాళీ స్థలాలను గానీ,